కథా నిలయం
5తె.09
శ్రీకాకుళం

# కలల కథ

బెజవాడ నగరంలో అద్దెకి గదులు దొరకడమనేది గొప్ప సమస్య అని ఈ ఊళ్ళో కాపురముంటున్న వాళ్ళకి తెలుసు. మా వాళ్ళకేం తెలుసు? సొంత ఊళ్ళో స్వర్గంలాటి సొంత ఇంట్లో కూర్చుని 'అయిబాబోయ్ అంత అద్దే' అని ఆశ్చర్యపోతే వాళ్ళకి నేనేం చెప్పేది? ఈ ఊరు అలాటిది. ఇక్కడ అద్దెలు అలాటివి. ఆఫీసుకి దగ్గర్లో గది కావాలంటే, అందునా అన్ని సదుపాయాలూ గలదై వుండాలంటే అంత అద్దె ఇవ్వక తప్పుతుందా?

గది దొరకడమే చాలనుకుంటూన్న నాబోటివాడిని ఇటు రాముడూ, అటు ఇల్లుగలావిడా. ఇద్దరూ చిత్రవధ చేయడం ప్రారంభించేరు. ఈ హింస గదిలో చేరిన మొదటి నెలనుంచీ ప్రారంభమైంది.

'తెలుగువాడు గడపదాటి కానివూళ్ళో ఉద్యోగం చేయలేడ'నే నానుడి నాపట్ల అక్షరాలా నిజమని వొప్పుకుంటాను. దానికి తగ్గట్టు ఈ గొడవొకటి నా మనసుని పాడుచేయడానికి.

ఇల్లుగలావిడ నోరు మంచిదికాదని రాముడు నాకు పాఠాలు చెప్పక్క-

1964, మార్చి—భారతి

లేదు. ఆ మహత్తర విషయం నాకూ తెలుసు. పదిగంటల తర్వాత గదిలో లైటు కనుపిస్తే ఆవిడ గొంతు చించుకుని మరీ జగడానికి రావడమనేది రాముడి కొక్కడికే కాదు, నాకూ బాధగానే వుంటుంది. కానీ రాముడికి సర్దుకుపోడం చాతకాదు. అదేమంటే—

'నీకు పౌరుషంగానీ, చీమూ నెత్తురుగానీ లేవూ' అవటాని నామీద విసుక్కునేవాడు. నామీద విసుక్కుంటే ఫర్వాలేదు. ఒక ఊరివాళ్ళం, ఒకే ఊళ్ళో ఉద్యోగం చేస్తున్నవాళ్ళం, పైపెచ్చు రూమ్‌మేట్సు కావడాన వాడిని క్షమించగల హృదయ వైశాల్యం నాకు లేకపోలేదు. కానీ ఆవిడెవరు? (కాళికాదేవి అంటాడు రాముడు.) ఆవిడ నోరు పారేసుకుంటే వీడూ నోరు చేసుకోవడమేనా? రాముడికోపం చూస్తుంటే ఒక్కోనాడు నాకే భయంగా వుండేది. పొరపాటున ఆవిడమీద చేయి చేసుకుంటే వీడి గతేంగాను? అనే దిగులూ వుండేది. నేనెంత వారించినా వినేవాడు కాదు.

జ్ఞాపకానికి నిలిచిన రోజు! ఇక్కడ ముచ్చటించక తప్పదు. ఆనాడు తలనొప్పిగా వుండటంచేత ఒకగంట పర్మిషన్ పెట్టి గదికొచ్చి కూర్చున్నాను. ఒళ్ళంతా నొప్పులు — లేచి నించోడానిక్కూడా ఓపిక చాలడంలేదు.... కొంచెం జ్వరం లాటిది గూడా వచ్చినట్టుంది. ఇలాటి సమయాల్లో నిద్ర బాగా పనిచేస్తుందని ఒకనాటి స్వానుభవంవల్ల తెలుసుకున్నాను. అందుచేత నిద్రకోసం కళ్ళు మూశాను. కానీ ఫలితం దక్కలేదు. నిద్ర రాలేదు. పైగా విసుగ్గా వుంది. ఓపిక గనక వుంటే ఆ పళాన లేచి లీలామహల్లో సినిమా చూసేద్దును.

అయిదయ్యింది. తలుపు దగ్గర చప్పుడైంది. పడుక్కునే తల తిప్పి ఆవేపు చూశాను. రాముడు హడావిడిగా వచ్చాడు. వచ్చీ రావటంతోనే వాడి తాలూకు పెట్టె బేడా సర్దుకున్నాడు. బైట నించున్న జట్కా

సాయెబుని పిలిచి అతని సాయంతో వాటిని బండిలో వేయించాడు. ఆనక నాముందు నించుని. చేతులు దులుపుకుంటూ అన్నాడు :

"కొత్తగది కుదుర్చుకు వచ్చాను. మీ ఆఫీసుకి 'మరీ' దగ్గర్లో వుంది. ఇవ్వేళే వస్తున్నామనీ చెప్పాను. రావాలనుకుంటే రా! లేదూ— ఈ రాక్షసి అభిమానానికి బలైనా నాకేం అభ్యంతరంలేదు. మంచి రూమ్మేట్లు దొరకరనే అపనమ్మకం నాకు లేదు. ఏదో ఒకమాట తేల్చి చెప్పు తొరగా"

తల దిమ్మెత్తేలా ఆశ్చర్యపోయాను.

మరేమీ మాటాడలేదు. లేచి నిలబడి బట్టలు మార్చుకున్నాను. రాముడు గర్వంగా నవ్వేడు. వా డెప్పుడూ అలాగే నవ్వుతాడు. నవ్వి అన్నాడు—

"స్నేహితులకేం చాలామంది వుంటారు. కానీ నీలాటి ఆత్మీయుడూ, చెప్పిన మాటని ఆలకించి తగిన విధంగా నడుచుకునే బుద్ధిమంతుడూ దొరకడం అరుదు. అందుకు గర్వంగా వుంది నాకు"

ఆపైన వాడంతట వాడే నాపెట్టే. హోల్డాలూ వగైరా సర్దేడు.

కొత్త రూములో కాలుంచే వేళకి జ్వర తీవ్రత ఎక్కువైంది నాకు. హోల్డాలు పరిచి నడుం వాల్చేను. సామానంతా అద్దంలా శుభ్రంగా రాము దొక్కడే సర్దేడు. తర్వాత నన్ను పరామర్శించేడు—

"ఏమిటా షేక్స్పియర్ పోజూ! మార్చేయ్; చూడలేక ఛస్తున్నాను"

"నావొంట్లో బాగోలేదోయ్!"

వాడు ఖంగారుపడిన మాట వాస్తవం. నా నొసటిపైన చేయి వేశాడు; ఉలిక్కిపడ్డాడు.

"జ్వరం బాగావుంది" అన్నాడు. నవ్వి ఊరుకున్నాను.

ఆ రాత్రి వాడు నాకుచేసిన పరిచర్యలు తల్చుకుంటే ఇప్పటికీ రాముడిమీద జాలివేస్తుంది నాకు. ఏవో మాత్రలు తెచ్చాడు; పాలు తెచ్చాడు. కన్ను మూయకుండా రాత్రింతా నా పక్కనే కూర్చున్నాడు.

వాడికెందు కింత శ్రద్ధ ?

తెల్లవారుతూనే నవ్వుతూ పలుకరించేసరికి వాడి మొహంలో గంపె డానందం ప్రకాశించింది.

"మొత్తానికి హడలకొట్టావు. శుభమాని కొత్త రూములో చేరితే...."

"అదేం కాదులే ! పాత రూంలోనే కొంచెం తలనొప్పిగావుంది" వాడు చిన్నబుచ్చుకోడం యిష్టంలేదు నాకు.

ఆ ఉదయంగానీ మా రూమూ, పరిసరాలూ చూడటం సంభవించింది కాదు. పైగా ఆరోజు ఆదివారం కావడాన తీరుబడి చిక్కింది.

మూడు అంతస్థుల మేడ తాలూకు మూడో అంతస్థులో చివరిగది మాది. ఇక్కడ మొత్తం నాలుగు గదులున్నాయి. నాలుగింట్లోనూ మాలాటి 'కురత్రజాతే' అద్దెకుంటున్నారు. రెండో అంతస్థులో కొన్ని కాపురాలూ, క్రింది భాగంలో మరికొన్ని కాపురాలతోపాటు ఇల్లుగల వాళ్ళూను. మొత్తానికి హిందూదేశానికి స్పెసిమన్‌గా వుంది ఈ భవనం. రాముడు దానికో చక్కటి నామకరణమూ చేశాడు. 'జాగ్‌తేరహో' బిల్డింగుట ! నవ్వొచ్చింది.

మాపక్క రూముల్లోని జనాభా అందరినీ పరిచయం చేసుకున్నాడు రాముడు. వాళ్ళకి నన్నూ పరిచయం చేశాడు. మావాడి కలుపుగోలుతనం కొత్త కాదు నాకు. ఎంత సీమనుంచి వచ్చిన దొరనైనా ఇట్టే ఆకట్టుకో గల గుణం రాముడికున్న అర్హతల్లో మొదటిదీ ముఖ్యమైనదీను.

హోటల్లో భోంచేసి రూమ్‌లో కొచ్చి కూర్చున్న తర్వాత సిగరెట్టు కాలుస్తో అన్నాడు వాడు—

"బిక్కు-బిక్కుమంటూ ఏమీ తోచక చచ్చాం ఆ పాత గదిలో. ఇక్కడ చూడు కావలసినంత కాలక్షేపం !"

ఎంత స్నేహితులమైనా అన్నింటిలోనూ ఏకాభిప్రాయం వుంటుం దంటే నే నొప్పుకోను. అందుకే వాడి కామెంటుని పట్టించుకోలేదు.

ఈ 'భవనం'లో కాపురముంటూన్న మనుషులూ వాళ్ళ వివరాలూ చాలా చెప్పాడు. గడిచిన ఈ కొద్ది గంటల్లో వాడు సేకరించిన ఈ వివ రాలు ఆశ్చర్యాన్ని కలిగించినా, వాటికి నేనంత ప్రాముఖ్యత ఇవ్వలేదు.

అగ్గిపెట్టెకోసం పక్క రూమాయన రావడంతో రాముడి నోటికి తాళం పడింది. అగ్గిపెట్టె యిచ్చి వచ్చి నతన్ని కూర్చోపెట్టించాడు. అతని పేరు ఆనందరావు. గుమాస్తాయేగానీ వాలకం చూస్తుంటే అతని ఉద్యో గం చప్పున చెప్పడం తెగింపే మరి. మావాడికి తగిన నేస్తం. నిజమే- లేకపోతే నేనంటూ ఒక క్రిచర్ అక్కడ వున్నాననే యిది మరిచి కేవ లం వాళ్ళిద్దరే మాట్లాడుకోడ మేమిటి ?

చాలా విషయాలు మాటాడుకున్నారు. చివరికి హాలీవుడ్ చిత్రాల మీదికి వచ్చింది సంభాషణ. మహానటుల పేర్లూ, వాళ్ళ నటనాకౌశలమూ, వాళ్ళ జీవిత విశేషాలూ వగైరాలు వాళ్ళ సబ్జెక్టు. అక్కడ్నుంచి కేవలం సినిమాల గురించే చెప్పకున్నారు. మావాడు మహత్తర కళాఖండం గురించి చెబుతే ఆనందరావు ఫరెవర్ పిక్చర్సు గురించి ఉద్ఘాటించేడు. ఆ ప్రేక్షక మహాశయుల లోకోత్తరమైన ఉత్సాహం అభినందించక తప్పదు.

అకస్మాత్తుగా ఆనందరావు టాపిక్ మార్చేడు. వాళ్ళ రూమ్‌మేటు పైన దండయాత్ర ప్రారంభించేడు.

గుమాస్తాల్లోనూ 'రకాలు' లేకపోలేదుట. రెండొందలు పుచ్చు కునేవాడూ, తొంభై రూపాయలు సంపాయించేవాడూ ఇద్దర్నీ కలిపి

'గుమాస్తా' లనడం ఆనందరావుకి మంట. వాళ్ళ రూమ్‌మేటు రెండో రకం గుమాస్తాట. నాన్ గ్రాడ్యుయేటు. వచ్చే నాలుగు డబ్బులీ్ని జాగ్రత్తగా చూచి వాడుకోడం, (లేకపోతే చస్తాడా !) అవసరాలు సైతం వాయిదావేయడం అతని లక్షణాలట. అతనితో తన స్నేహం — తన ఉత్సాహాన్నీ. పరుగులుతీసే తన సరదాలనీ చంపేస్తున్నదిట.

చెప్పద్దూ - ఆనందరావుపట్ల నాకు చిరుకోపం కలిగింది. ఇంత తలతిక్కగా మాటాడే మనుషులమీద నాకు గౌరవ ముండదు. అతను చెప్పేది శ్రద్ధగా వింటూ రెండో సిగరెట్టుని ఆఫర్ చేసిన రాముడి మీదనూ కోపమొచ్చింది.

మొదట్నుంచీ ఒక పద్ధతికి అలవాటుపడిన వాడిని. నా అభిప్రాయాలు కుండ బద్దలుకొట్టినట్టు మొహం ముందు చెప్పగల నేర్పు లేదు నాకు. అది పిరికితనమన్నా వొప్పుకోను.

వాళ్ళ మాటలు పూర్తయిన తర్వాత ఇద్దరూ మాట్నీకి ప్రయాణమయ్యారు. నేను రాలేకపోతున్నందుకు చాలా చింతించుచున్నట్లు ఆనందరావు స్వయంగా సెలవిచ్చాడు.

ఇద్దరూ సినిమాకి వెళ్ళిన తర్వాత ఆనందరావు రూమ్‌మేటుని చూడాలనిపించింది. కానీ ఆ తలుపుకి తాళంవేసి వుంది.

మర్నాడు ఆఫీసునుంచి వచ్చే వేళకి ఆనందరావు వాళ్ళ గుమ్మం ముందు కుర్చీలో కూర్చుని ఆకాశంలోకి చూస్తున్నాడు వెంకటరెడ్డి!

ఆకాశంలోకి చూస్తోన్న (లేక) రెండు చేతుల్లోనూ తలను దాచుకుని విచారిస్తోన్న (లేక) శూన్యంలోకి చూపు నిలిపిన.... గటాగ్రిలు చదివినా, చూసినా నవ్వుగా వుంటుంది. క్షమించాలి. భవదీయుడిని మినహాయించి మాట్లాడటం అన్యాయమే మరి.

వెంకటరెడ్డి గ్రాడ్యుయేటు కాని కుర్రవాడు! సినిమాలూ, సర

దాలూ యిష్టంలేని యువకుడు ! తొంభై రూపాయలకు ఊడిగంచేస్తున్న ఒకానొక నలుసు ! ఆనందరావు ఆనందాన్ని ఖూనీచేసిన హంతకుడు !

ఎదటివాడు తెలీకమునుపు అతని గురించిన ఆలోచనలు వేరు. పరోక్షంగా తెలిసిన తర్వాత కలిగే అభిప్రాయం వేరూను. ఎంత వద్దనుకుంటూన్నా రెడ్డి పైన ఆనందరావు ఉపన్యాసం గుర్తుకొస్తూనే వుంది.

నా గది తలుపు తీస్తుండగా రెడ్డి నావైపు చూసేడు. పలుకరింపు చిహ్నంగా చిన్నగా నవ్వేను. అతనూ నవ్వేడు. అతని నవ్వులో 'కళ' లేదు. కాదంటే అతన్ని మరో కోణంలోంచి చూడటం నాకు చాతకానట్టు చెప్పాలి.

గదిలోకి వెళ్ళాను. బట్టలు మార్చుకొని మళ్ళా బయటకొచ్చాను. ఈమాటు రెడ్డి చూపు మేడంత యెత్తు పెరిగిన బాదంచెట్టుపైన నిలిచి వుంది. ఆ ఆకులమాటున దేన్నో వెతుకుతూ ఆలోచిస్తున్నాడు. నవ్వుకున్నాను మళ్ళీ.

అతనేమి ఆలోచిస్తుంటః గ్రాడ్యుయేటు కాలేకపోయే నేమిటానా? తనకొచ్చే తొంభై రూపాయలు చాలడం లేదేమాననా ? రెండొందల జీతగాళ్ళ జీవిత మెట్లుండుననా ? దేన్ని గురించి ఆలోచిస్తున్నాడు ?

బాగుంది వరస. రెడ్డిని చూస్తుంటే నాకూ ఆలోచనలు వచ్చేట్టున్నాయి. నేనూ ఓ కుర్చీ తెచ్చుకుని మా గదిముందు వేసుకుని ఆకాశంలోకి—ఈ ఆలోచన రాగానే ఫకాలున నవ్వేశాను.

రెడ్డి ఉలిక్కిపడి నావైపు చూశాడు. ఆ చూపులో తత్తరపాటు వున్నది. అతనలా చూస్తున్నప్పుడు సిగ్గుపడిపోయాను. ఎందుకలా నవ్వేనా అని బాధపడ్డాను.

క్షణాల తర్వాత అతనే పలుకరించేడు.

"మీదే ఊరండీ ?"

గతుక్కుమన్నాను. రెడ్డి చాతుర్యం అర్థమైంది. విశాఖపట్టణం నుంచి వచ్చేరా అని అడగడం పాతపద్ధతి. అదేగా అతని అభిప్రాయం? కోపమొచ్చింది. కానీ అణచుకుని మా ఊరు పేరు చెప్పాను.

"అదృష్టవంతులు" అన్నాడు రెడ్డి.

"ఎందుకనిట ?"

"చాలా దగ్గర్లో వున్నారు"

తలూపాను.

"మీ ఊరు చెప్పారు కాదు" అడిగేను.

అతను చెప్పేడు. కానీ ఆపేరు నే నెప్పుడూ వినలేదు. జాగ్రఫీ చదివినా అంత తొరగా తెలిసేపేరు కాదది. చిత్తూరు జిల్లాలో మారుమూల కుగ్రామం.

ఆ రోజుకి అతన్తో మాటాడింది అదేను.

నా కీ విధంగా పరిచయమైన రెడ్డి చాలా కొద్దిరోజుల్లో ఆప్తమిత్రుడై పోయాడు. అతను చాలా అమాయకుడు. అతని ఆలోచనలు చిత్రంగా వుంటాయి. వినేవాడు రెడ్డిమీద జాలి చూపించగలడు. రెడ్డి కలలుకనే మనిషి. ఆ కలల్ని తను భద్రపరచుకోడు. గుండెల్లో దాచుకోడు. ఎదటి వాడికి విపులీకరించి చెబుతేనేగాని తృప్తి కలగ దతనికి.

రెడ్డిని గమనించిగానీ,నా మొహమాటంవల్లగానీ నే నతని కలలు వింటూ జాలి చెందేవాడిని. అదే మా రాముడుగానీ, ఆనందరావుగానీ వింటే రెడ్డిని గేలిచేసి వుండేవారన్నది నిజం.

ఒక్కొనాడు అనేవాడు రెడ్డి —

"ప్రేమించడం నాకు చాతనవుతుం దంటారా ? అసలు ఆ లక్షణాలు నాలో వున్నాయంటారా ?" అని. నవ్వేవాడిని. 'తమ్ముడూ ! ఇదే మరోడిని అడుగుతే వాడు నిన్ను మోసేయగలడు జాగ్రత్త' అని చెప్పేందుకు నా నోరు ఆడేదికాదు.

ఒక్కోనాడు అనవసరంగా బోరు కొట్టేసేవాడు. సొంత ఊరుని ప్రేమించని మానవుడు యీ ప్రపంచంలో ఎవడున్నాడు ? కాబట్టి. తరచూ మా ఊరు వెళ్ళి వస్తుండేవాడిని. అమ్మా, నాన్నా, ప్రాణంపెట్టే మిత్రులూ, జ్ఞాపకంలోంచి చెరిగిపోని మా కాలేజీ—నాయరు బడ్డీకొట్టు, సినిమా థియేటర్లూ, బజారు ఇవన్నీ నాకు చాలా యిష్టమైనవని చెబితే ఎవరూ ఆశ్చర్య పోనక్కర్లేదు.కానీ అదేమి ఖర్మమో మాఊరి గురించి ఎన్నిమాట్లు చెప్పినా, రెడ్డి మళ్ళా కొత్త ఊరు గురించి అడిగినట్టు అడుగుతూండేవాడు. ఒకమాటు, రెండుమాట్లు, పదిమాట్లయినా అతని పద్ధతిలో మార్పు రాలేదు. నేను మాఊరు వెళ్ళి వచ్చిన ప్రతీ తడవా 'సముద్రం బాగుంటుందా ? సరుగుడు చెట్లు ఎలా వుంటాయి ? మీ కా ఊళ్ళో బ్రహ్మాండంగా తోస్తుంది కదూ ?' ఇలాంటి డిటో ప్రశ్నలు వేస్తూండేవాడు. కొత్తలో అవుతే చెప్పడానికి నాకూ సరదాగానే వుండేది గానీ రాను రాను చిర్రెత్తుకొచ్చేది. ఏవిటీ చచ్చు పరామర్శలు ? సముద్రం బాగోక ఎలా వుంటుంది? అక్కడ సరుగుడు చెట్లు రోజు రోజుకీ మారుతూంటాయా ? అక్కడికీ రెడ్డిని మా ఊరికి ఆహ్వానించేను. కానీ రాలేనన్నాడు. ఆకాడికి ఈ విషయసేకరణెందుకు ?

ఇదీ నా ప్రశ్న. ఒకనాడు తెగించి అడిగేశాను.

"మా ఊర్ని గురించి చెప్పడానికి నాకేం అభ్యంతరంలేదు గానీ, రోజూ అడిగిందే అడగడం, చెప్పిందే చెప్పడం నాకేం నచ్చదు. పోనీ మా ఊరు రమ్మంటే రారు. ఏమిటి మీ ఉద్దేశం ?" అని.

అతను ఖంగున జవాబు చెప్పలేదు గానీ, కాసేపు మౌనంగావుండి ఆ తర్వాత కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అదిరిపడ్డాను. క్షమించమని అడిగి మా రూములోకి వచ్చేశాను.

రెడ్డితో నా స్నేహం రాముడికి నచ్చలేదు. సమయం వచ్చినప్పు

డల్లా నా కి విషయమే హెచ్చరిస్తూ వుండేవాడు. వాడి సలహాని కొట్టి పారేయడం అలవాటైంది నాకు.

మళ్ళా రెండురోజుల వరకు రెడ్డి నాకు కనుపించలేదు. కొంచెం బాధగానే వున్నది నాకు. ఒకనాడు గాంధీనగరం సెంటర్లో దాదాపు సాయంత్రిం ఆరున్నర సమయాన రెడ్డి పాత పుస్తకాల దగ్గర నించు న్నాడు. అతని దగ్గరికి వెళ్ళేను. పలుకరించేను. కనుపించడం లేదేమని అడిగేను. అతని జవాబు విని ఆశ్చర్యపోయాను. అతనన్న దిది :

"నిజం మాష్టారూ ! నేను మిమ్మల్ని విసిగిస్తున్నాను. చాలా అన వసరమైన విషయా లడిగి మిమ్మల్ని కష్టపెట్టేను. ఇంకా నా పద్ధతి మార్చుకోవాలి. అందుకే బాగ రాత్రి పదేంతవరకూ ఆఫీసులోనే గడి పేస్తున్నాను. కానీ....అక్కడగూడా నన్ను అపార్థం చేసుకుంటున్నారు మాష్టారూ ! ఆఫీసులో కూర్చునేది ఆఫీసరు మెప్పు సంపాయించాలని కాదు"

అతని భుజం తట్టి అన్నాను.

"మీరు చాలా మంచివారు రెడ్డీ ! రండి. అలా పార్కులో కూర్చుందాం"

అప్పు డతని మొహంలో నిండిన ఆనందం నాకు బాగా జ్ఞాపకం. పార్కులో కొచ్చి కూర్చున్న తరువాత చెప్పాడు —

"మా ఊరు మీ ఊరంత అందంగా లేకపోయినా నాకూ మా ఊరంటే యిష్టమే. కానీ అది చాలా దూరం. బోల్డు ఛార్జీ లవుతాయి. పైగా మా యిల్లు నరకం. తెలిసిన వాళ్ళెవరూ నన్ను పలుకరించరు. అలాంటప్పుడు నేనెలా మా ఊరు వెళ్ళేది ? వెళ్ళినా నాకేం తోస్తుంది ? చెప్పండి మాస్టారు ?"

నేనేమీ జవాబివ్వకపోయినా అతని పరిస్థితి ఊహించగలను. మళ్ళా అతనే అన్నాడు.

"మిమ్మల్ని చూస్తుంటే నాకు ఈర్ష్య. ఎంచక్కా సరదాగా మీ ఊరెళ్ళి హాయిగా అక్కడ గడిపి తిరిగొస్తారు.మీరు మీ ఊరు గురించీ. మీ వాళ్ళని గురించీ చెబుతూంటే నాకు ఆనందంగా వుంటుంది"

పిచ్చిరెడ్డి ! ఎంత పసివాడివయ్యా నువ్వు !

"నేను చాలా దురదృష్టవంతుణ్ణి మాస్టారూ ! నాన్న లేడు. అమ్మ వుంది. మా అమ్మ యిప్పటికీ వొళ్ళువంచి చాకిరీ చేస్తుంది.మా అమ్మకి సుఖంలేదు. పెళ్ళికాని చెల్లెలూ. చదువుకోవాలనే కోరికున్న తమ్ముడూ. చెడిపోయిన అన్నయ్యా. అందరూ అన్నీ సమస్యలే. అన్నయ్య తాగుతాడు. జూదగాడు. వదిన్ని కొడతాడు. అమ్మని డబ్బివ్వమని బాధపెడతాడు. చెప్పండి మాస్టారూ ! నే నెలా ఆ యింట్లో వుండను ? అది యింటి విషయం. పోతే నా స్నేహితులు. వాళ్ళందరూ వ్రయోజకులు. పెళ్ళిళ్ళు చేసుకున్నారు.చదువుకునే రోజుల్లోనే నన్ను వెధవ అనేవారు. ఇప్పుడు వాళ్ళకి నే నెక్కడ కనిపిస్తాను ?"

చాలు. రెడ్డి యింకేమీ చెప్పకపోయినా అత ననుభవించే నరకం నే నూహించగలను. అందుకే అతను కలలు కంటున్నాడు. అందుకనే అతను చిత్రమైన మనిషిలా, పిచ్చి మాలోకానికి 'నమూనా'గా కనిపించేడు.

ఆ రాత్రి రెడ్డిద్వారా మరో విడ్డూరం విన్నాను. అతని రూములోంచి ఒక నెక్లెసు తీసుకొచ్చి చూపించేడు. ఎలా వుందని అడిగేడు. నిజానికది చాలా బావుంది.

"దీన్ని మా చెల్లి గురించి కొన్నాను. అతి కష్టంమీద సంపాదించిన ఈ ఒక్క వస్తువూ చెల్లి మెళ్ళో వేయడానికి నోచుకోలేక పోతున్నాను. ఈ నగ అన్నయ్య కంటబడితే....వొద్దు మాస్టారు. మాయింట్లో వాళ్ళెవరూ సుఖపడటానికి నోచుకోలేదు. అంతే. అన్నీ అలా జరగా

ల్సిందే. తప్పదు. నే నిక్కడ రెండు పూటలా భోంచేస్తున్నాను. మీలాటి మంచి స్నేహితుడితో కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నాను. నేను.... చాలా విషయాలు మరిచిపోవాలి. స్వార్థమైతే కావచ్చు గానీ మావాళ్ళ గురించి నే నసలు బాధ పడకూడదు"

పడుక్కునే ముందు రెడ్డి మాటలు గుర్తుకొచ్చేయి. ఎదటివారి గురించి తన బ్రతుకుని పాడుచేసుకోడానికి ఎవ్వడూ ఒప్పుకోడు. తన లాంటి వాళ్ళు ఓ పక్కన ఝామ్మంటూ కాలాన్ని నెట్టేస్తుంటే జీవిత మనే ఈ పరుగు పందెంలో అవకాశముండి కూడా ఓడిపోడానికి రెడ్డే కాదు—ఎవ్వడూ ఒప్పుకోడు.

* * *

ఒంట్లో బాగుండక వారం రోజుల సెలవుమీద మా ఊరు వెళ్ళాను. తిరిగొచ్చిన మొదటిరోజు. ఆఫీసునుంచి రావడంతోనే రెడ్డి కోసం చూశాను. గది తలుపులు తీసి వున్నాయి గానీ గదిలో రెడ్డి లేడు. గదిముందు వుండవలసిన కుర్చీ కూడా లేదు. వారం రోజుల్లోనే రెడ్డి అలవాట్లు మారిపోతాయని నాకేం తెలుసు ?

డాబామీద పిట్టగోడ వారగా కుర్చీలో కూర్చున్న రెడ్డి పిలుపు విని తలెత్తి చూశాను. రెడ్డి మొహం కలకలలాడుతోంది. అతను టెరిలిన్ షర్టులో హుందాగా వున్నాడు. అతని వేళ్ళ మధ్య సిగరెట్టు వెలుగుతోంది.

అతని దగ్గరకు వెళ్ళేను.

అతను లేచి నిలబడ్డాడు. పిట్టగోడ వారగా నించున్నాడు. ఆ నించోడం ఠీవిగా వుంది. సిగరెట్టు అందంగా కాల్చుతున్నాడు. మును పెప్పుడో పోగొట్టుకున్న అలంకరణ తాలూకు విశేషాలన్నీ అతన్నిప్పుడు ఆవరించినట్టున్నాయి.

"హౌ ఆర్ యూ సార్ !" అన్నాడు రెడ్డి.

ఆ రకమైన పరామర్శకి కొంచెం బెదిరాను. స్వస్థత చిక్కనట్టు చెప్పేను.

"నిలబడే వున్నారు; కూర్చోండి. హేవ్ యువర్ సీట్"

"వర్వాలేదు. మీరే కూర్చోండి"

"ఇందాకట్నుంచీ కూర్చునే వున్నాను. ఐ లైక్ టు స్టాండ్ ఓన్లీ! మీరు కూర్చోవాలి"

రెడ్డికంటే తాగినవాడు నయమనిపించింది. కూర్చోక తప్పింది కాదు. ఈలోగా అతను సిగరెట్టు దమ్ము ఒకటి పీల్చాడు. పొగని ఆకాశంవైపు వదిలి, పెదాలను అందంగా నాలికతో తుడుచుకుంటో—

"మీతో చాలా విషయాలు మాటాడాలి! రేదర్ చెప్పుకోవాలి"

సరిగ్గా నే నూహించిన విధంగానే ఈ మార్పు కేదో కథ వున్నదన్నమాట!

అతను చెప్పాడు.

"పది రోజుల క్రితం ఒక అమ్మాయిని చూసేను" మాట నాపి నా దగ్గరిగా వచ్చి "చాలా అందమైన పిల్ల. వెరీ బ్యూటిఫుల్. ఒంటరిగా ఇంకా గడపలేను. నాకు పార్టనర్ కావాలి. మా యిద్దరికీ మరెవ్వరితోనూ ప్రమేయం వుండరాదు. ఎన్నాళ్ళనుంచో నాలో మెదులుతూన్న యీ కోరికకి పది రోజుల క్రితం ఓ రూపం ఏర్పడింది. రెండు రోజుల క్రితం ఓ నిశ్చయానికి వచ్చాను. ఐ వాంట్ టు మేరీ దట్ గర్ల్"

ఇన్నాళ్ళూ మా రాముడినీ, ఆనందరావునీ చాతకాక ద్వేషించానేమో! రెడ్డిలాటి మనుషులేం చేయాలి? రెడ్డి కేవలం కలలుకనే మనిషే అనుకున్నాను. కార్యసాధనకి నడుం కట్టేంత ధీమా అతనికి లేదనీ అనుకున్నాను.

"లేవండి" అన్నాడు పొలికేకతో రెడ్డి. లేచాను.

నా మొహంలో చూపు నిలిపి చాలా సీరియస్‌గా చెబుతోన్నట్టు—

"మనముందు మేడలో రెండో కిటికీ వుంది. అంటే నావీపు తిన్నగా నన్నమాట. చూశారా. ఆ కిటికీ వూసల్లోంచి చూస్తే మీకో చక్కటి అమ్మాయి కనిపించింది కదూ. ఆ పిల్లే! ఆమెనే నేను పెళ్లాడ బోయేది. సర్గిగ్గా చూసి మీ సలహా చెప్పండి" అన్నాడు రెడ్డి.

సభ్యత కాదని తెలిసినా చూడటం జరిగింది. ఆమె ఆకారం కని పించగానే తల దించుకున్నాను. అలాటి పరిస్థితిని రెడ్డి నాకు కలుగజేసి నందుకు కొంచెం కోపమూ వచ్చింది. అందుకే అన్నాను.

"మిస్టర్ రెడ్డీ! ఇవన్నీ మీ సొంత విషయాలు. పైగా నాకి ప్రేమ విషయాల్లో బొత్తిగా అనుభవంలేదు. నాలాటి వాడి సలహా లడ గడంగానీ, నాతో మీ ప్రేమ కథలు చెప్పడంగానీ యిష్టంలేదు నాకు. ప్రేమ మినహా మరేదైనా మాటాడాలనుంటే నన్ను పలుకరించండి. లేదూ....గుడ్‌బై" నాలుగు మాటలూ వడ్డించి డాబా దిగి వచ్చేశాను. అయినా రెడ్డి దిగలేదు.

రెడ్డి వ్యవహారం యిలా తయారయ్యింది. పోతే మా రాముడ్ని గురించి — ఎప్పుడూ నవ్వుతూ, పేలుతూ వుండే నిక్షేపంలాంటి కుర్రాడు బెంగతో చస్తున్నట్టు, సినిమాలూ సరదాలూ మాని రూములో కూర్చుని గోళ్ళు గిల్లుకుంటున్నాడు. అదేమనడుగుతే సమాధానం రాదు. నన్నే కాదు, అతని జాతిమనిషి ఆనందరావుని గూడా చాలామాట్లు నిరుత్సాహ పరిచాడు. ఆఫీసూ, గదీ ఈ రెంటినీ అంటిపెట్టుకుంటున్నాడు రాముడు.

ఒకనాడు రూము కొచ్చేసరికి రాముడికీ, రెడ్డికీ మధ్య తగాదా తారస్థాయిలో వుంది. ఇద్దరూ ఒకర్నొకరు ఇంగ్లీషులోనూ, మధ్య మధ్య తెలుగులోనూ తిట్టుకుంటున్నారు. రాముడు నన్ను చూచి గబగబా మా గదిలోకి వచ్చాడు.

"ఈ గదిని మనం వెంటనే ఖాళీ చెయ్యాలి" అన్నాడు.

బిత్తరపోయాను.

"నీకే చెప్తూంట....ఈ గదిని ఖాళీ చేయాలి. అదీ యిప్పుడే ఈ క్షణమే.మళ్ళా మనం పాత గదిలోకి పోదాం. అన్నీ మాటాడే వచ్చాను. తొరగా తెములు"

నాకు చిరెత్తుకొచ్చింది. ఏమిటి వీడి వరస ?

"నీకేం మతి పోలేదుగదా రాముడూ? మళ్ళా ఏ మొహం పెట్టుకు పాత గదికి పోతాం ? పైగా ఆ యింటావిడ రాక్షసి గూడాను"

"అయినాసరే. నామాట విని వచ్చేయ్"

"నేను రాను. నీ యిష్టమొచ్చినట్టు తలూపడానికి నేను గంగి రెద్దును గాను"

"అంతేనా ?"

"అంతే"

ఆ రాత్రి వాడు నాతో మాటాడలేదు.భోజనానికి వెడుతున్నప్పుడు కూడా పిలువలేదు. ఆరోజు మొదలుకొని నాలుగు రోజులు అదే వరసగా మౌనవ్రతం పాటించేడు రాముడు. రాముడికీ, రెడ్డికీ తగాదా ఎందుకు వచ్చిందో ? ఏ కారణంవల్ల రాముడు గది మారిపోదామని అంటున్నాడో ? అటు రెడ్డినీ గానీ, ఇటు రాముడ్నీ గానీ అడగలేక పోయాను.

ఒకరోజు థియేటర్లో ఆనందరావు ఒక్కడే అగుపించాడు. ఇంటర్వెల్లో టీ తాగుతూండగా అతనే పలుకరించేడు. మాటల మధ్యలో రాముడు రెడ్డీల విషయం కదిలింది. అతను బిగ్గరగా నవ్వి మెల్లిగా అన్నాడు.

"వాళ్ళి మధ్య లవ్ ఎఫైర్లో పడ్డారు మాస్టారు! రెడ్డికి ప్రేమించ

దం తెలీదనీ, అందు కతను తగడనీ మీవాడి అభిప్రాయం. నువ్వేం బోడి సలహా లివ్వక్కర్లేదని రెడ్డి. బలే ఫార్సులేండి"

రెడ్డి వ్యవహారంలో రాము డెందుకు తలదూర్చా లసలు ? ఆ రాత్రి పడుక్కునేముందు అదే అడిగాను రాముడ్ని. అతను వినిపించుకోనట్టు తలని అటువైపు తిప్పుకున్నాడు. కొంచెం బాధపడ్డాను.

"మనం పసిపిల్లలం కాదు రాముడూ ! ఇలా ఎన్నాళ్ళని నాతో పంతం కడతావ్ ? నే చేసిన తప్పేమి టసలు ?"

"ఎవరైనా సరే నా మాట వినకపోతే నాకు కోపం"

"అవతలివాళ్ళు నీలాటివాళ్ళేనని ఎందు కనుకోవు ?"

"అనుకోను"

నవ్వొచ్చింది. నవ్వేశాను.

రాముడు లేచి కూర్చున్నాడు. నావైపు తీక్షణంగా చూస్తో—

"నీకేం తెలీదసలు. రెడ్డి ఎంత అల్లరి చేస్తున్నాడో నువ్వేం పట్టించుకోడంలేదు. వాడి వెకిలిచేష్టలు చూస్తుంటే నాకు తల తిరిగిపోతుంది. అందికే నా కీ రూములో వుండ బుద్ధిపుట్టడంలేదు" అన్నాడు.

రాముడ్ని మొదట్లో అర్థం చేసుకోలేక పోయినందుకు చింతించేను. మళ్ళా ఏమీ మాటాడలేదు.

ఆ ఉదయం రాముడు వాళ్ళ బేంక్‌నుంచి ఫోన్ చేశాడు. వాడికి బదిలీ అయిందిట, ఒంగోలు వేశారుట. రాత్రి బండికి వెడుతున్నాట్ట.

పిడుగుపడి నట్టయింది నాకు. ఏడుపు వచ్చింది.

ఒకగంట పర్మిషన్ తీసుకుని పెందరాళ్లే రూముకొచ్చేను. పుట్టెడు దిగులు కడుపులో పెట్టుకుని. రూము దగ్గర అంతమంది జనాన్ని చూసేసరికి భయం కలిగింది. విషయం తెలిసి విస్తుపోయాను. రెడ్డి రాసిన ప్రేమలేఖని పట్టుకుని నడివీధిలో అతని పరువు తీసేస్తున్నారు జనం.

అతను తలొంచుకు నిలబడి వున్నాడు. నన్ను చూచీ చూడనట్టు నటించేడు. ఎవరో ముసలాయన రెడ్డినీ. అతని వ్యక్తిత్వాన్నీ కడిగిపారేస్తున్నాడు పదుగురిలోనూ.

గదిలోకి వచ్చి తలుపులు వేసుకున్నాను.ఒక గంట తర్వాత వాతావరణం చల్లబడ్డది కాబోలు, వీధిలో మాటలు తగ్గేయి. కిటికీలోంచి కిందికి చూశాను. రెడ్డి ఒక్కడూ నడుచుకుంటో వెళ్ళిపోతున్నాడు. ఎందుకో అతనిమీద జాలి కలిగింది.

పనిమనిషి తలుపు తడితే తలుపు తీశాను. ఆమె చాలా చెప్పింది. రెడ్డి ప్రేమించిన పిల్ల మొన్నీ మధ్యనే వాళ్ళ చిన్నాన్న గారింటికి వచ్చిందిట. పెళ్ళయిన రెండో నెలలో ఆమెకి వైధవ్యం ప్రాప్తించిందిట. ఆ పెళ్ళి గూడా ప్రేమించి చేసుకున్నదిట. మనసు కుదుటబరచుకునేందుకు సొంత ఊరు వదిలి చిన్నాన్న గారింటికి వచ్చిందిట.

రెడ్డి మొదటి ప్రేమ యిలా తగులడినందుకు, నలుగుర్లోనూ అతను నగుబాటు పాలైనందుకు ఓ పక్క కోపమూ, మరోపక్క జాలీ కలిగాయి.

రాత్రి ఏడు గంటలకు రాము దొచ్చాడు. పెట్టే బేడా సర్దుకున్నాడు. వాడివెంట స్టేషనుకి వెళ్లేను. స్టేషను దగ్గర పడుతుందనగా అన్నాను.

"నీకిలా అకస్మాత్తుగా ట్రాన్స్ఫరవడం నాకు విచారంగా వుంది రాముడూ!"

"ఈ బదిలీకి ఒక కారణం నువ్వే!" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను.

"అవును. పాత రూములో చేరితే నాకు ఒంగోలు ప్రయాణం వుండేది కాదు. పాత రూముకి రానన్నావ్. ఒంగోలుకి ట్రాన్స్ఫర్ కోరాను"

"కాదు. నువ్వేదో దాస్తున్నావ్. దీన్లో నాదేం తప్పులేదు. రాము మారడంలేదనే చిన్న కారణాన్ని ఆధారం చేసుకుని ఊరొదిలి వెళ్ళిపోయేంత పిచ్చివాడవు కాదు నువ్వు" అన్నాను.

"నువ్వో కారణ మన్నానేగాని, కేవలం నువ్వే అనలేదు. రెండో కారణం అదిగో ఆ పిల్ల. రెడ్డి ప్రియురాలు"

అర్థంకాలేదు నాకు.

"పెళ్ళిచూపుల్లో ఆమెను చూసేను. నన్ను చేసుకోడాని కిష్టపడలేదామె. మొహం ముందే ఆ మాట అన్నది.నన్ను అవమాన పరచింది"

"ఇప్పుడామె విధవట. తెలుసా?"

"తెలుసు. అందుకే ఆమెను రోజూ చూడలేక ఛస్తూండేది. ఆమెను చూస్తే నాకు కోపం, జాలి, దయాను. రెడ్డి ఆమెను ప్రేమించాడు. అతడు ఫూల్. అవతల వాడిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించ డసలు" అన్నాడు రాముడు ఉద్రేకంగా. వాడి కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి.

స్టేషన్ చేరుకున్నాం. రైలొచ్చింది. రాము డెక్కాడు. చివరి మాటగా అన్నాడు—

"బెజవాడలో మన చివరోజులు చేదుగా గడిచేయి. మరిచిపో. వెనకటి మన తియ్యటి స్నేహాన్నే గుర్తుపెట్టుకో. నీలాటి మంచి స్నేహితుడ్ని వదిలి దూరంగా పోతున్నానంటే నాకు సరదా కాదు. నా మనసూ అలాటిది కాదు. నీ మాట వినివుంటే, ఆ పాత గదిలోనే వుంటే, ఆమె నాకు కనిపించేదీ కాదు, రెడ్డి నాకు తెలిసేవాడూ కాదు, నేను ఒంగోలూ వెళ్ళేవాడిని కాదు. పోనీలే.... అయ్యిందేదో అయ్యింది.నన్ను క్షమించు"

రైలు కదిలింది. చెయ్యూపుతూ నిలబడ్డాను.

స్టేషన్నుంచి వస్తూ దార్లో భోజనం ముగించి మరీ రూము

కొచ్చాను. రెడ్డి గది తలుపులు బార్లా తెరిచి వున్నాయి. ఆనందరావు రెడ్డి నేదో అంటున్నాడు. గుమ్మం దగ్గిరికి వెళ్ళాను. ఆనందరావు నన్ను చూచి నిలబడ్డాడు. రెడ్డి హోల్డాలుమీద బోర్లా పడుకున్నాడు. ఆనందరావు అన్నాడు.

"రెడ్డి తాగొచ్చేడు. నా కేవిటో భయంగా వుంది. నే నింకా భోజనం చేయలేదు. నాకేం తోచకుండా వుంది. మీ రిక్కడ కూర్చోండి. భోంచేసి యిప్పుడే వస్తాను"

నా జవాబైనా వినకుండా ఆనందరావు వెళ్ళిపోయాడు.

అయిదు నిముషాలపాటు గుమ్మం దగ్గరే నుంచున్నాను.

మతివున్న మనిషి తాగుతే అలవాటంటారు. బెదిరిపోయిన మనిషి తాగుతే అతని పిరికితనానికి చక్కటి మందంటారు. ఏమైనా తాగేవాళ్ళవి పూల్సని చాలామంది అంటారు. రెడ్డి తాగాడు. మరోప్పుడైతే అస హ్యించుకునేవాడినే.

అతని దగ్గరిగా వెళ్ళాను. అతన్ని తట్టాను. రెడ్డి నావైపు చూసేడు. మరుక్షణమే ఘొల్లున ఏడ్చేశాడు. నా రెండు చేతులూ పుచ్చు కున్నాడు.

"క్షమించండి మాస్టారూ! తాగేను. మీతో మాటాడటానికి అర్హత లేదు.... ప్రేమించడం చాతకాదు నాకు.... గుండెల్ని కోసే అవమానం పొందేను.... చివరికి.... చెల్లెలుకోసం కొన్న నగనికూడా తెగనమ్మి.... నా స్వార్థానికి, నా సరదాలకి....

అతని మాటల్ని అతని దుఃఖం మింగేసింది. పసిపిల్లవాడిలా, గుండె లవిసేలా ఏడుస్తున్నాడు. ఆ ఏడుపుకి అంతంలేదు.

జీవితంలో మొదటిసారిగా తాగుబోతులమీద జాలి కలిగింది.

*　　*　　*

ఉదయం పనిమనిషి చెప్పింది - రెడ్డి ప్రియురాలూ, వాళ్ళ చిన్నాన్నగారూ ఆ యిల్లు ఖాళీ చేశారుట.

ఆనందరావు చెప్పాడు - తనకో చీటీ రాసి ఆ అర్ధరాత్రి ఎక్కడికో వెళ్ళిపోయాడుట రెడ్డి ।

నా గుండెల్లో బరువు నిలిచింది. అప్పటికప్పుడే పాత గది కుదుర్చుకునేందుకు 'రాక్షసమ్మ'గారింటికి బయలుదేరేను.

o--o